సూర్య www.suryaa.com 19వ వసంతంలోకి..

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
సోమవారం
24-11-2025
పేజీలు: 02


# సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్

సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ సూర్యకాంత్ సోమవారం ఉదయం ఢిల్లీలోని రాష్ట్రప్రతి భవన్‌లో ప్రమాణస్వీకారం చేశారు. జస్టిస్ సూర్యకాంత్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రమంత్రులు, గవర్నర్లు, పలువురు ముఖ్యమంత్రులు హాజరయ్యారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రమాణస్వీకార మహోత్సవానికి హాజరయ్యారు. అంతేకాదు ఫస్ట్‌టైమ్ వివిధ దేశాల నుంచి న్యాయమూర్తులు కూడా అటెండ్ అయ్యారు.



ఎవరు ఈ జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టబోతున్న తొలి హర్యానా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డ్ సృష్టించబోతున్నారు. జస్టిస్ సూర్యకాంత్ 2027 ఫిబ్రవరి వరకు దాదాపు 15 నెలలపాటు పదవిలో కొనసాగుతారు హర్యానాలోని హిసార్ జిల్లా పెట్వార్ ఆయన స్వస్థలం. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన సూర్యకాంత్ ..న్యాయవాద వృత్తిలో అంచలంచెలుగా ఎదిగారు. అతిచిన్న వయసులోనే హర్యానా అడ్వకేట్ జనరల్‌గా పనిచేశారు. పంజాబ్, హర్యానా హైకోర్టుల్లో అనేక కీలక కేసులను డీల్ చేశారు. 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన సూర్యకాంత్, 2024 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.ఆర్టికల్ 370 రద్దు, దేశద్రోహ చట్టం నిలిపివేత వంటి కీలక తీర్పులిచ్చిన ధర్మాసనాల్లో జస్టిస్ సూర్యతకాంత్ సభ్యుడిగా వున్నారు. సుప్రీంతోపాటు అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లలో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ఆదేశించారు. వన్ ర్యాంక్ వన్ పెన్షన్ పథకాన్ని సమర్థిస్తూ.. రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందంటూ ఆయన తీర్పునిచ్చారు. పెండిగ్ కేసులను పరిష్కరించడమే తన తొలి ప్రాధాన్యత అన్నారు జస్టిస్ సూర్యకాంత్. వీలైంతన త్వరగా పెండింగ్ కేసులను క్లియర్ చేసేందుకు సరైన మెకానిజాన్ని ప్రవేశపెడుతామన్నారు.

హర్యానాకు చెందిన జస్టిస్ సూర్యకాంత్ హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. అంతకుముందు ఆయన పంజాబ్, హర్యానా హైకోర్టు న్యాయమూర్తిగా వ్యవహరించారు. 2019 మే 24న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. రెండు దశాబ్దాలుగా వివిధ ధర్మాసనాల్లో పనిచేసిన జస్టిస్ సూర్యకాంత్ పలు కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. న్యాయపరమైన తర్కానికి, సామాజిక న్యాయంపై బలమైన ప్రాధాన్యతకు పేరుగాంచిన ఆయన రాజ్యాంగ ధర్మాసనంలోని అనేక విషయాలలో, పాలన, పర్యావరణ సమస్యలు, రాజ్యాంగ వివరణలపై కీలక తీర్పులలో భాగంగా ఉన్నారు. 15 నెలల పాటు సీజేఐగా ఉండనున్న ఆయన ఎన్నికల సంస్కరణలు, క్రిమినల్ జస్టిస్, డిజిటల్ ప్రైవసీ వంటి ప్రధాన రాజ్యాంగ అంశాలకు సంబంధించిన కేసులలో భాగస్వామి కానున్నారు.





## తెలంగాణలో ఎస్బీఐ పేరుతో వాట్సాప్‌లో కొత్త తరహా సైబర్ మోసం

తెలంగాణలో సైబర్ నేరగాళ్లు మరోసారి రెచ్చిపోయారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేరుతో ఆదివారం ఒక్కరోజే లక్షలాది మంది వాట్సాప్‌లకు నకిలీ సందేశాలు పంపి భారీ మొత్తంలో డబ్బు కొల్లగొట్టారు. బ్యాంకులకు సెలవు దినాన్ని అదునుగా మార్చుకుని ఈ భారీ మోసానికి పాల్పడ్డారు.'ఈ రోజు అర్ధరాత్రిలోపు మీ ఆధార్ నెంబర్‌ను అప్‌డేట్ చేసుకోండి. లేదంటే మీ ఎస్బీఐ ఖాతా నిలిచిపోతుంది' అంటూ హెచ్చరికతో కూడిన సందేశాన్ని సైబర్ కేటుగాళ్లు పంపారు. ఆధార్ అప్‌డేట్ కోసం 'ఎస్బీఐ ఆధార్ అప్‌డేట్ యాప్' పేరుతో ఒక ఏపీకే ఫైల్ లింక్‌ను జతచేశారు. ఇది నిజమైన సందేశమని నమ్మిన చాలామంది, ముఖ్యంగా సీనియర్ సిటిజన్లు ఈ లింక్‌ను క్లిక్ చేసి మోసపోయారు.ఈ సందేశాన్ని పొరపాటున తెరిచిన వారి ఫోన్లలోని వాట్సాప్ గ్రూపులన్నింటిలోకి హ్యాకర్లు సులువుగా ప్రవేశించారు. జర్నలిస్టులు, మంత్రులు, చివరికి సీఎంఓ వాట్సాప్ గ్రూపులను కూడా వదల్లేదు. అనేక గ్రూపుల కంట్రోల్ తీసుకుని, వాటి డీపీలను ఎస్బీఐ లోగోతో మార్చేశారు. ఓ జర్నలిస్టుకు వచ్చిన సందేశాన్ని క్లిక్ చేయడంతో ఆయన ఫోన్‌లోని అన్ని గ్రూపులకు ఈ మాల్‌వేర్ వ్యాపించిందని తెలిసింది.ఈ ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే ఫోన్లు హ్యాంగ్ అవ్వడం, బ్యాంకు ఖాతాల్లోని డబ్బు మాయమవడం జరిగాయి. దీంతో వేలాది మంది బాధితులు సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేశారు. ఈ ఫైల్ ఇన్‌స్టాల్ కాగానే ఫోన్‌లోని ఓటీపీలు, ఎస్ఎంఎస్‌లు, యూపీఐ పిన్‌ల వివరాలు హ్యాకర్ల చేతికి చిక్కుతున్నాయి. నిమిషాల వ్యవధిలోనే వారు ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. అంతేకాకుండా బాధితుల ఫోన్ నుంచి వారి కాంటాక్టులకు డబ్బు అడుగుతూ సందేశాలు పంపడం, స్క్రీన్ రికార్డింగ్ ఆన్ చేయడం వంటివి కూడా చేస్తున్నట్లు గుర్తించారు.



## ఢిల్లీ పోలీసులపై పెప్పర్ స్ప్రే.. 22 మంది అరెస్ట్

వాయు కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారంటూ స్థానికులు ఆదివారం ఇండియా గేట్ సమీపంలో ఆందోళన నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ ఆందోళన ఉద్రిక్తతలకు దారితీసింది. ఆందోళన చేస్తున్న వారిని తొలగించడానికి ప్రయత్నించిన పోలీసులపై కొందరు పెప్పర్ స్ప్రే చల్లడంతో ముగ్గురు నలుగురు గాయపడ్డారు. ఈ ఘటనపై అధికారులు చర్యలకు ఉపక్రమించారు. ఆందోళనకారులపై కేసులు నమోదు చేశారు. విధుల్లో ఉన్న ప్రభుత్వ అధికారులపై దాడి చేశారన్న ఆరోపణలపై 22 మందిని ఢిల్లీ పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. అధ్వాన గాలి నాణ్యతను మెరుగుపర్చడానికి చర్యలు తీసుకోవాలని కొందరు పౌరులు ఆదివారం ఇండియా గేట్ వద్ద ఆందోళన చేశారు. అయితే అక్కడ అందోళనకు అనుమతి లేదంటూ పోలీసులు వారిని పంపించేశారు. దాంతో వారు సీ-హెక్సాగాన్ ప్రాంతానికి వెళ్లి అక్కడ ఉన్న బారికేడ్లను తొలగించడానికి ప్రయత్నించారు. తర్వాత రోడ్డుపై బైఠాయించి నినాదాలు చేశారు. అంతేకాదు మావోయిస్టు హిడ్మా అనుకూల నినాదాలు చేశారు. వారిని తొలగించడానికి ప్రయత్నించిన పోలీసులపై హఠాత్తుగా పెప్పర్ స్ప్రే చల్లారు. దీనిపై అధికారులు తాజాగా చర్యలు చేపట్టారు.




## హాట్ లుక్‌లో రకుల్ ప్రీత్ సింగ్

స్టార్ హీరోయిన్ల జాబితాలో ఒకప్పుడు టాప్‌లో నిలిచిన పేరు రకుల్ ప్రీత్ సింగ్. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన క్యూట్ లుక్స్, స్మార్ట్ అటిట్యూడ్, బబ్లీ ఎనర్జీతో ఫ్యాన్స్ హార్ట్‌ని కొల్లగొట్టింది ఈ పంజాబీ సుందరి. కానీ ఇప్పుడు ఆ గ్లామర్ గేమ్ కొంచెం కష్టాల్లో ఉంది. రకుల్ కెరీర్ ఎటువైపు వెళ్తుంది..? గ్లామర్ షోతో నెట్టుకొస్తుందా..? అనే అనుమానాలు వస్తున్నాయిప్పుడు. రకుల్‌కు గ్లామర్ షో కొత్తేమీ కాదు. కెరీర్ ప్రారంభం నుంచి ఆమె లుక్, స్టైల్, ఫిట్‌నెస్ అన్నీ పర్ఫెక్టుగా ఉండేవి. టాలీవుడ్‌లో ఆమె చేసిన వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్, కరెంట్ తీగ, ధృవ లాంటి సినిమాలు బ్యూటీతో పాటు నటనకు కూడా నిదర్శనమే. కానీ టైమ్ గడుస్తున్న కొద్దీ.. ఇండస్ట్రీలో పోటీ పెరిగిన కొద్దీ రకుల్ తన గ్లామర్ డోస్‌ను పెంచింది. ఇప్పుడు ప్రతి ఈవెంట్‌లోనూ, సోషల్ మీడియాలోనూ, ఫ్యాషన్ ఫోటోషూట్లలోనూ ఆమె అందాల ఆరబోతే ఫ్యాన్స్‌కు ఫీస్ట్ అయింది.




## జియో యూజర్లకు గుడ్‌న్యూస్

గత కొద్దిరోజుల కిందట భారతీయ టెలికం రెగ్యులేటరీ అథారిటీ అన్ని టెలికాం కంపెనీలను కాలింగ్, ఎస్ఎంఎస్‌తో మాత్రమే చౌక రీఛార్జ్ ప్లాన్లను తీసుకురావాలని ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ప్రముఖ ప్రైవేట్ టెలికం సంస్థ రిలయన్స్ జియో కాలింగ్, ఎస్ఎంఎస్‌తో రెండు తక్కువ ధర రీచార్జ్ ప్లాన్స్‌ను ప్రవేశపెట్టింది. జియో తన వెబ్‌సైట్‌లో రెండు కొత్త వాయిస్ ఓన్లీ ప్లాన్‌లను జాబితా చేసింది. ఇందులో యూజర్లకు 365 రోజుల వరకు వ్యాలిడిటీని పొందుతారు. డేటా ఉపయోగించని వారికి ఈ ప్లాన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జియో ఈ ప్లాన్ ముఖ్యంగా కాలింగ్, ఎస్ఎంఎస్ మాత్రమే ఉపయోగించే వారి కోసం తీసుకువచ్చింది. ఇందులో డేటా మాత్రం అందుబాటులో ఉండదు.
ఈ రెండు ప్లాన్స్ రూ.458కి 84 రోజుల వ్యాలిడిటీ, రూ.1958కి 365 రోజుల చెల్లుబాటు ఉంటుంది.

## తెల్లాపూర్‌లో భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్ శివార్లలోని తెల్లాపూర్‌లో భారీగా గంజాయి పట్టుబడింది. పశ్చిమబెంగాల్ నుంచి హైదరాబాద్‌కు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను తెల్లాపూర్‌లోని ఓ లేబర్ క్యాంప్‌లో మాదాపూర్ ఎస్‌వోటీ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి 42 కిలోల గంజాయిని సీజ్ చేశారు. దీని విలువ రూ.21 లక్షలు ఉంటుందని అధికారులు చెప్పారు. బెంగాల్‌కు చెందిన మితున్ భర్మా, సుడెన్ రాయ్, షేక్‌ను అరెస్టు చేశామని, ప్రధాన నిందుతుడు బిస్వా తప్పించుకున్నాడని తెలిపారు. వారి వద్ద గంజాయితోపాటు 5 ఫోన్లు సీజ్ చేశామన్నారు. నిందితుపై ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



## అర్ధరాత్రి సీపీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు

హైదరాబాద్‌లో సీపీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి 12 గంటల నుంచి 3 గంటల వరకు లంగర్‌హౌస్, టోలిచౌకి ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. రౌడీషీటర్ల ఇండ్లకు నేరుగా వెళ్లారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, ప్రస్తుత జీవనంపై ఆరా తీశారు. నేర ప్రవృత్తి విడిచిపెట్టాలని హెచ్చరించారు. రాత్రి వేళల్లో తెరచి ఉన్న దుకాణాలకు హెచ్చరికలు జారీచేశారు. ప్రజలు చేసిన ఫిర్యాదులపై పోలీసులు వేగంగా స్పందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. విజిబుల్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.




## ఆస్ట్రేలియన్ చాంప్ లక్ష్యసేన్

భారత యువ షట్లర్ లక్ష్యసేన్ ఈ సీజన్‌లో తొలి టైటిల్‌తో మెరిశాడు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో లక్ష్యసేన్ 21-15, 21-11తో యుశి తనాక (జపాన్)పై అద్భుత విజయం సాధించాడు. 38 నిమిషాల్లోనే ముగిసిన తుది పోరులో 26 ఏండ్ల సేన్ వరుస గేముల్లో ప్రత్యర్థిని చిత్తుచేశాడు. తద్వారా టైటిల్ కరువుకు ఆస్ట్రేలియన్ ఓపెన్ విజయంతో చెక్ పెట్టాడు. ఇక ఫైనల్ పోరు విషయానికొస్తే ప్రపంచ నంబర్26 షట్లర్ యుశి తనాకపై సేన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. మ్యాచ్‌పై పట్టు నిలుపుకుంటూ కచ్చితమైన ప్లేస్‌మెంట్స్‌తో షాట్లు కొట్టడం ఈ యువ షట్లర్‌కు బాగా కలిసొచ్చింది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు..

**- మంత్రి పొన్నం**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, వారిని తన అక్కాచెల్లెళ్లతో సమానంగా చూసుకుంటానని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గారు హామీ ఇచ్చారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జరిగిన ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు స్వయంగా బొట్టు పెట్టి చీర (సారె) అందించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళల కోసం అనేక విప్లవాత్మక కార్యక్రమాలను చేపట్టిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు గత పది సంవత్సరాల నుంచి వడ్డీ లేని రుణాలను నిరంతరంగా అందిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఇందులో భాగంగా మహిళా సంఘాలకు పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్లు, బస్సులు వంటి వ్యాపార అవకాశాలను కల్పిస్తోందన్నారు. ఇక ముందు కూడా అర్హులైన వారికి వాటిని అందించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి మహిళా సంఘాల సభ్యులు స్వయంగా బొట్టు పెట్టి ఈ ఇందిరా మహిళా శక్తి చీరల సారె పంపిణీని చేపడుతున్నారని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతి మహిళకు ఈ చీరలు పంపిణీ చేయబడతాయని మంత్రి పేర్కొన్నారు. 'మీకు ఏ కష్టం రానివ్వను. భవిష్యత్తులో ఆర్థిక వృద్ధి సాధించి మహిళలు ఉన్నత శిఖరాలకు ఎదగాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేస్తుంది' అని ఆయన మహిళలకు భరోసా ఇచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి, వాటిని ఆధునిక ప్రమాణాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

నియోజకవర్గంలోని ప్రతి గ్రామ పంచాయితీలో తాగునీటి శుద్ధి కోసం వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గౌరవెల్లి ప్రాజెక్టు పనులు వేగంగా జరుగుతున్నాయని, ఒక్కో మెట్టు పూర్తి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు.





### తెలంగాణ సర్వపిండి, సకినాలు ఇక గ్లోబల్ బ్రాండింగ్,

## ఆన్‌లైన్ మార్కెటింగ్‌కు సన్నాహాలు

అంకాపూర్ చికెన్.. తాపేశ్వరం కాజా.. ఆత్రేయపురం పూతరేకుల మాదిరిగానే మేడ్చల్ జిల్లా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేస్తున్న తినుబండారాలకు ప్రత్యేక బ్రాండింగ్ కల్పించేందుకు తెలంగాణ గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కృషి చేస్తున్నారు. మేడ్చల్ జిల్లాలో మొత్తం 3,585 మహిళా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో 38,526 మంది సభ్యులు క్రియాశీలకంగా ఉన్నారు. ఈ సంఘాలలో దాదాపు 60 శాతం మంది సభ్యులు ఇంట్లోనే సాంప్రదాయబద్ధమైన తినుబండారాలను తయారు చేసి స్వయంగా విక్రయిస్తున్నారు. ఈ మహిళలు తయారుచేసే ఉత్పత్తుల్లో స్థానిక, ఆరోగ్యకరమైన పదార్థాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. వీరు లడ్డూలు, బూందీ, సర్వపిండి, సకినాలు, కజ్జికాయలు, గవ్వలు వంటి అన్ని రకాల మిఠాయిలను బెల్లంతో మాత్రమే తయారు చేస్తున్నారు. అంతేకాకుండా.. రాగులు, జొన్నలు, కొర్రలు వంటి చిరుధాన్యాలతో కూడా ప్రత్యేక మిఠాయిలు, బూందీ, కారప్పూస, మిక్చర్ వంటి అల్పాహారాలను వినియోగదారులకు అందిస్తున్నారు. పెరుగుతున్న ఆరోగ్య స్పృహ దృష్ట్యా.. వీరి ఉత్పత్తులకు పట్టణ ప్రాంతాల్లో మంచి డిమాండ్ లభిస్తోంది. ఈ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో బ్రాండింగ్ కల్పించే లక్ష్యంతో అధికారులు SHG సభ్యులకు నాణ్యత, ఆధునిక పద్ధతులపై శిక్షణ ఇప్పించారు. ఆహార తయారీలో శుభ్రత, ఆకర్షణీయమైన ప్యాకింగ్, నాణ్యత ధ్రువీకరణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణలో భాగంగా, కేరళలోని ప్రసిద్ధ కుదుంబశ్రీ సంస్థ (దేశంలోనే అతిపెద్ద మహిళా SHG నెట్‌వర్క్), హైదరాబాద్‌లోని నిథమ్ సంస్థలకు మహిళలను తీసుకువెళ్లారు. అక్కడ అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి పిండివంటలు, పచ్చళ్లు, పొడులు వంటి వాటిని వేగంగా, నాణ్యతా ప్రమాణాలతో ఎలా తయారు చేయాలో నేర్పించారు. ప్రస్తుతం ఈ మహిళలు తమ ఉత్పత్తులపై భారత ఆహార నాణ్యత ప్రమాణాల అధీకృత సంస్థ అయిన ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (FSSAI) ధ్రువపత్రాలను ముద్రించి విక్రయిస్తున్నారు. బిట్స్ హైదరాబాద్ ఆచార్యులచే ప్రత్యేక తరగతులు నిర్వహించి, మార్కెటింగ్ వ్యూహాలు, బహుళజాతి సంస్థలతో ఒప్పందాలు, రుణ సదుపాయాలు, విక్రయాలలో లాభనష్టాల విశ్లేషణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వీరి విక్రయాలను పెంచేందుకు అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు. దీని ద్వారా మేడ్చల్ మహిళల ఉత్పత్తులకు గ్లోబల్ బ్రాండింగ్ రావటంతో పాటు మరింత మంది వినియోగదారులకు అందుబాటులోకి వస్తాయి.



## జీ20 సదస్సు నిర్వహణపై మోదీతో రమఫోసా

జీ20 సదస్సు నిర్వహణపై దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల దక్షిణాఫ్రికాలోని జొహన్నెస్‌బర్గ్‌లో రెండు రోజుల పాటు జీ20 సమావేశాలు జరిగిన విషయం తెలిసిందే. ఆఫ్రికా ఖండంలో ఈ సదస్సు జరగడం ఇదే మొదటిసారి. ఈ సమావేశానికి ప్రధాని మోదీ హాజరైన విషయం తెలిసిందే. ఆదివారం భారత్, దక్షిణాఫ్రికా నేతలు ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా రమఫోసా మాట్లాడుతూ.. జీ20 శిఖరాగ్ర సమావేశాల నిర్వహణలో భారత్ అందించిన మద్దతుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది ఇంత కష్టమైన పని అని చెప్పి ఉంటే.. ముందే పారిపోయేవాళ్లమని సరదాగా వ్యాఖ్యానించారు. సదస్సు నిర్వహణ విషయంలో భారత్ నుంచి చాలా నేర్చుకున్నామని తెలిపారు. భారత్ జీ20 సదస్సు ప్రాంగణం చాలా గొప్పగా ఉందని, తమ వేదిక చాలా చిన్నదని చెప్పారు. అయితే, ఇటువంటి వేదికలే ఎల్లప్పుడూ అందంగా ఉంటాయని ప్రధాని మోదీ స్పందించారు. 2023, సెప్టెంబర్‌లో 18వ జీ20 సదస్సును ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహించిన విషయం తెలిసిందే.


### ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్న..

## వైరల్ బ్యూటీ 'బందనా గర్ల్'?

సోషల్ మీడియాలో కొందరు ఓవర్ నైట్ సెలెబ్రిటీలు అయిపోతున్నారు. ఇప్పుడు నెట్టింట్లో ఏ వీడియో ఎప్పుడు, ఎందుకు వైరల్ అవుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం అలాంటి ఓ యువతి ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. నెటిజన్లు అంతా ఆమె కోసం తెగ వెతికేస్తున్నారు. ఆమె అసలు పేరు కచ్చితంగా తెలియకపోయినా.. అందరూ ముద్దుగా 'బందనా గర్ల్' అని పిలుచుకుంటున్నారు. అసలు ఈ 'బందనా గర్ల్' ఎవరు, ఆమె విశేషాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. ఈ నెల 2వ తేదీన 'bud wiser @ wordgenerator' అనే పేరుతో ఉన్న ఓ ఎక్స్ అకౌంట్ నుంచి రెండు సెకన్ల నిడివి ఉన్న వీడియో పోస్ట్ చేశారు. దానికి 'Makeup ate today' (ఈరోజు మేకప్ చక్కగా వేసుకున్నావు) అనే క్యాప్షన్ పెట్టారు. ఆ వీడియోలో ఒక అమ్మాయి తెలుపు రంగు టాప్, వెండి చెవిపోగులు, బందనా (తలకు కట్టుకునే వస్త్రం) ధరించి కనిపిస్తోంది. ఆటోలో కూర్చుని ఈ వీడియో తీసినట్టుగా అర్థమవుతోంది. కాగా ఈ వీడియోకు.. 100 మిలియన్లకు పైగా వ్యూస్, లక్షల్లో లైక్‌లు, వేలల్లో కామెంట్లు రీపోస్టులు దక్కాయి.

**ఎవరీ బందనా గర్ల్?**

వీడియోలో కనిపించిన యువతికి 'బందనా గర్ల్' అని పేరు పెట్టారు నెటిజన్లు. అయితే ఈమె ఎవరు అని



తెలుసుకోవడానికి తెగ వెతికేస్తున్నారు. ఈ బందనా గర్ల్ పోస్ట్ వైరల్ కావడంతో.. పలు మీడియా సంస్థలు ఆమె ఎవరా అని ఆరా తీశాయి. దీంతో ఆమె పేరు ప్రియాంగ అని ఓ మీడియా సంస్థ పేర్కొంది. కానీ ఇది ఇంకా ధ్రువీకరణ కాలేదు. అయితే ఆ మీడియా సంస్థ తెలిపిన సమాచారం ప్రకారం.. తన వీడియో ఇంత వైరల్ అవ్వడం.. తానే నమ్మలేకపోతోందట. మహా అయితే వెయ్యి లైకులు వస్తాయని అనుకున్నానని.. కానీ ఇది ఇప్పుడు తన కంట్రోల్‌లో లేదని చెప్పిందట. తన ముఖాన్ని సోషల్ మీడియాలో పదే పదే చూసి తానే అలసిపోయినట్లు వైరల్ బ్యూటీ తెలిపిందని ఆ మీడియా సంస్థ పేర్కొంది. ఈ వీడియో ఎంతలా వైరల్ అయిందంటే.. ఆ క్లిప్ పోస్ట్ చేసిన ఎక్స్ అకౌంట్‌కు దెబ్బకు బ్లూటిక్ వచ్చేసింది. ఆ తర్వాత కొందరు ఔత్సాహికులు అలాగే ఆటోలో సెల్ఫీ వీడియోలు తీసుకుని పోస్టు చేశారు.

### శ్రీశైలం యాదవ్ నా కోసం

## 4 లారీలో జనాలు పంపించారు

### సుమన్ షాక్ కామెంట్స్

శ్రీశైలం యాదవ్ నా క్లోజ్ ఫ్రెండ్, నాలుగు లారీల్లో మనుషులను పంపి నన్ను సపోర్ట్ చేశారు ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి నవీన్ యాదవ్ గెలుపొందారు. నవీన్ యాదవ్ తండ్రి శ్రీశైలం యాదవ్ మరియు ఆయన కుటుంబానికి నటుడు సుమన్ చాలా క్లోజ్‌గా ఉన్నారు.ఈ మధ్య, నవీన్ యాదవ్ కోసం సుమన్ ప్రచారంలో పాల్గొన్నారు. ఇటీవల ఒక TV10 ఇంటర్వ్యూ లో సుమన్ నవీన్ గెలుపు, శ్రీశైలం యాదవ్ గురించి పలు ఆసక్తికర విషయాలు చెప్పారు.సుమన్ మాట్లాడుతూ, చెన్నై నుంచి హైదరాబాద్ కు సినీ పరిశ్రమ వచ్చినప్పుడు, జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఉన్న చిన్న శ్రీశైలం యాదవ్, తలసాని, దానం నాగేందర్, శ్రీహరి వంటి వారు పరిచయం అయ్యారని చెప్పారు. చిన్న సమస్యలు వచ్చినప్పుడు శ్రీశైలం యాదవ్ వీటిని సాల్వ్ చేసేవారు. పండగల సమయంలో కొందరు రాత్రి పూట డబ్బులు వసూలు చేయడానికి వచ్చేవారు. ఒకసారి సుమన్ ఫోన్ చేయగా, శ్రీశైలం యాదవ్ నాలుగు లారీలలో సుమారు 200 మంది మనుషులను పంపి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈ సంఘటనతో సుమన్ మరియు శ్రీశైలం బాగా క్లోజ్ అయ్యారు. సుమన్ మాట్లాడుతూ, "మీకు ఏం సమస్య ఉందా, నన్ను అడగండి. నేను వెళ్లే కరాటే ఫంక్షన్స్‌కు కూడా ఆయన స్పాన్సర్‌గా ఉన్నారు. తర్వాత ఫ్యామిలీ ఫ్రెండ్స్ అయ్యాం" అని పేర్కొన్నారు.నవీన్ యాదవ్ గురించి చెప్పిన సుమన్, "నవీన్ చిన్నప్పటి నుంచే నా ఫ్రెండ్ కొడుకు. గతంలో ఓడిపోయినప్పుడు శ్రీశైలం కొంచెం డిప్రెషన్‌లోకి వెళ్లారు. ఈసారి కూడా ఆయన నిలబడతారు అని చెప్తే, 'ఏ పార్టీలో టికెట్ వచ్చినా వస్తాను, ప్రచారం చేస్తాను' అని తెలిపాను. వచ్చి



నిజంగా ప్రచారం చేశాను" అని అన్నారు.సుమన్ అదనంగా తెలిపారు, "ఈ మూడేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటే ఇక్కడ పనులు అవుతాయి. సెంటర్ సహాయం ఇవ్వదు, ప్రతిపక్షం చేయదు. అందుకే నవీన్ కోసం ప్రచారం చేశాను. నన్ను అడిగారు, 'నవీన్ రౌడీ కాదా?' అని. అతనిపై కేసులు ఉంటే టికెట్ ఎలా వస్తుంది? ఇవన్నీ నాకు తెలుసు. శ్రీశైలం నా కోసం చాలా సపోర్ట్ చేసారు, అందుకే ఆయనకు నేను చేస్తాను. ఆయనకు నా ఇష్టం" అని అన్నారు.ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



## అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా రిజిస్ట్రేషన్ కార్యాలయాలు

రంగారెడ్డి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. ఈ కార్యాలయాల్లో జరుగుతున్న అవినీతిపై ఓ వైపు ఏసీబీ అధికారులు దాడులు జరుపుతున్నా అధికారుల తీరు మాత్రం మారడం లేదు. ఇప్పటికే జిల్లాలోని శంకర్‌పల్లి, వనస్థలిపురం, గండిపేట, సరూర్‌నగర్ వంటి రిజిస్ట్రేషన్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు దాడులు జరిపి అధికారులపై వేటు వేశారు. ఈ కార్యాలయాల్లో డాక్యుమెంట్‌కో ఓ రేట్‌ను ఫిక్స్ చేసి మరీ వసూళ్లు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొందరు రియల్‌ఎస్టేట్ వ్యాపారులు డాక్యుమెంట్ రైటర్లతో కుమ్మక్కై అక్రమ వ్యాపారానికి తెరలేపుతున్నారు. దళారులను అడ్డం పెట్టుకుని అధికారులు సాగిస్తున్న అవినీతి దందా రోజురోజుకూ పెరుగుతున్నది.

## శాన్వీ శ్రీవాస్తవ లేటెస్ట్ స్టన్నింగ్ ఫొటోస్

ఈ బ్యూటీ చేసింది తెలుగులో నాలుగు సినిమాలే.. తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకుంది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసింది. కొన్ని సినిమాల్లో తన అందంతో ప్రేక్షకులను కవ్వించింది. కానీ చేసిన సినిమాల్లో మొదటి సినిమా తప్ప మిగిలినవి అన్ని ఫ్లాప్ అయ్యాయి. దాంతో ఆమె తెలుగు సినిమాలకు పూర్తిగా దూరం అయ్యింది. ఇంతరభాషల్లో సినిమాలు చేస్తుంది. కానీ అక్కడ కూడా స్టార్ గా ఎదగలేకపోయింది. లవ్లీ సినిమా గుర్తుందా.? ఆది సాయి కుమార్ హీరోగా నటించిన ఈ సినిమాకు బీఏ జయ దర్శకత్వం వహించారు. ఈ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించింది శాన్వీ శ్రీవాస్తవ.తొలి సినిమాతోనే తన క్యూట్ పర్ఫామెన్స్ తో కవ్వించింది. ఆతర్వాత ఈ బ్యూటీకి వరుస ఆఫర్స్ వచ్చాయి. సుశాంత్ అడ్డా, మంచు విష్ణు రౌడీ, మరోసారి ఆదితో ప్యార్ మే పడిపోయానే సినిమాల్లో నటించింది. కానీ అవేమి వర్కౌట్ కాలేదు. దాంతో కన్నడ ఇండస్ట్రీకి వెళ్ళింది. అక్కడ కాస్త పర్లేదు అనిపించుకుంది.

